సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



డివైడర్‌ను ఢీకొట్టిన కారు

అంత్రిగుడ గ్రామ సమీపంలో అరకు–పాడేరు జాతీయ రహదారి మలుపు వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. 8లో



విద్యార్థినులకు అస్వస్థత

చింతూరు కస్తూర్బా గాంధీ విద్యాలయానికి చెందిన ఐదుగురు బాలికలు అస్వస్థతకు గురయ్యారు. 8లో



భాష.. భావాలకు వారధి

వాడుక భాష వ్యవహారిక భాష కావాలని పరితపించిన వ్యక్తి గిడుగు రామమూర్తి పంతులు.. నేడు ఆయన జయంతి 8లో

న్యూస్‌రీల్

నేడు ఆర్‌అండ్‌ఆర్‌పై సమావేశం

చింతూరు: పోలవరం ప్రాజెక్టు ముంపులో భాగంగా చింతూరు గ్రామానికి పునరావాసం కల్పించే అంశంపై స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్‌అండ్‌ఆర్ చింతూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమణ తెలిపారు. గ్రామానికి చెందిన పీడీఎఫ్ కమిటీ సభ్యులతో ఇతర గ్రామస్తులతో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

కవి రమేష్‌కు సత్కారం



కవి రమేష్‌ను సత్కరిస్తున్న కళావేదిక ప్రతినిధులు

వీఆర్‌పురం: మండలంలోని రేఖపల్లి గ్రామానికి చెందిన కవి, రచయిత నూనె రమేష్‌కు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ సాహితీ సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏలూరులో సోమవారం నిర్వహించిన హేళాపురి జాతీయ కవి సమ్మేళనంలో ఆయన ఆలపించిన 'అంపశయ్య పై అమ్మ భాష ' కవిత'కు విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా ఆయనను శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్,సమన్వయకర్త కొల్లి రమావతి,జాతీయ ప్రధాన కార్యదర్శి ఈశ్వరీభూషణం, జాతీయ కార్యదర్శి చిట్టె లలిత తదితరులు ఘనంగా సత్కరించారు. రమేష్ తల్లిదండ్రులు అజరయ్య,శాంతమ్మలు ఆనందం వ్యక్తం చేశారు.

గెడ్డను దాటాలంటే సాహసం చేయాల్సిందే



కోడిమామిడి గెడ్డలోంచి బైక్‌ను మోసుకుంటూ వస్తున్న గిరిజనులు

జి.మాడుగుల: మండలంలోని కిల్లంకోట పంచాయతీలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి కోడిమామిడి గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తోంది. కిల్లంకోట– మద్దిగరువు మార్గంలోని గిరిజనులు రాకపోకలు సాగించాలంటే కోడిమామిడి గెడ్డను దాటేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది గిరిజనులు సోమవారం బైక్‌ను మోసుకుంటూ గెడ్డను దాటించారు.

దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు



నిందితులతో పోలీసులు

చింతపల్లి: బెదిరించి బంగారం దోపిడీకి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ అరుణ్ కిరణ్ తెలిపారు. మండలంలోని రింగుడుమెట్టుకు చెందిన ఇద్దరు వృద్ధులను బెదిరించి కారులో ఎక్కించుకుని మార్గం మధ్యలో వారి నుంచి ముగ్గురు బంగారం దోచుకున్నారని ఆయన వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. కొయ్యూరు మండలానికి చెందిన సెగ్గె శాంతి, పాడేరుకు చెందిన పాంగి రాంబాబు, మేడూరుకు చెందిన కిల్లో గణేష్ దోపిడీకి పాల్పడినట్టు నిర్ధారణ అయిందన్నారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి, బంగారం, మూడు సెల్ ఫోన్లు, నగదు స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

ప్రగతికి ముందడుగు

వారంతా గిరి మహిళలు. అక్షరజ్ఞానం అంతంతమాత్రమే అయినప్పటికీ.. ప్రభుత్వం అందించే సహకారంతో ఆర్థికాభివృద్ధి సాధనకు సరికొత్తగా ఆలోచించారు. చేయి చేయి కలిపి పొదుపు మొత్తంలో కొంత నగదును వెచ్చించి మార్ట్‌ను ఏర్పాటుచేశారు. రోజుకు రూ.లక్ష వ్యాపారం లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. మిగతా సంఘాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.



రంపచోడవరంలో మహిళా సంఘాలు ఏర్పాటుచేసిన చేయూత మార్ట్‌లో సరకులు



రంపచోడవరంలో ఏర్పాటుచేసిన మార్ట్

రంపచోడవరం: ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు మండలంలోని మహిళా సమాఖ్య సంఘాలు. ఇప్పటివరకు పొదుపుకే పరిమితమైన గిరి మహిళలు వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. ప్రగతికి బాటలు వేసుకుంటున్నారు.

రూ.24.45 లక్షల పెట్టుబడితో..

ఏజెన్సీ ప్రధాన కేంద్రం రంపచోడవరంలో అనేక వ్యాపార సంస్థలు ఉన్నాయి. వాటికి దీటుగా మహిళా సంఘాలు సొంతంగా చేయూత మార్ట్‌ను ప్రారంభించాయి. మండలంలోని 815 సంఘాల సభ్యులు భాగస్వాములయ్యారు. పెట్టుబడికి ఒకొక్క సంఘం రూ.3 వేలు కేటాయించాయి. ఇలా సమకూర్చిన రూ.24.45 లక్షలతో మార్ట్‌ను స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని సెట్రాజ్ భవనంలో ఏర్పాటుచేశారు.



మార్ట్‌లో డ్వాక్రా ఉత్పత్తులు

- వ్యాపార రంగంలోకి గిరి మహిళలు
- పొదుపు సొమ్ముతో చేయూత మార్ట్
- 815 మహిళా సంఘాల భాగస్వామ్యంతో వ్యాపారం
- నాణ్యమైన ఉత్పత్తుల విక్రయం
- వినియోగదారుల నుంచి విశేష ఆదరణ

- డ్వాక్రా మహిళలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులతో పాటు అన్ని రకాల నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచారు. వినియోగదారులకు నాణ్యమైన సరుకులు ఇచ్చే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు.
- పసుపు, కాఫీ, శీకాయ ఉత్పత్తులతోపాటు చిరుధాన్యాలైన సామలు, జొన్నలు, కొర్రలు, గంటి, రాగులు మార్ట్‌లో విక్రయిస్తున్నారు.
- వ్యాపార నిర్వహణ కోసం సంఘాల సభ్యులంతా కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీ ద్వారా మార్ట్ నిర్వహణ కోసం మేనేజర్, సేల్స్ బాయ్‌లను నియమించారు. వచ్చిన లాభంలో కొంత సొమ్మును జీతాలకు వెచ్చించి, మిగతా మొత్తాన్ని పెట్టుబడికి ఉపయోగిస్తున్నారు.
- ప్రతి వచ్చిన లాభాలతో జీతాలు ఇవ్వడం, మిగిలిన డబ్బులు తిరిగి పెట్టుబడి కోసం వినియోగిస్తున్నారు.

రూ. కోటి టర్నోవర్ లక్ష్యం



మండలంలోని డ్వాక్రా మహిళ సంఘాల సహకారంతో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను రూ.కోటి టర్నవర్‌కు తీసుకువెళ్లాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. రోజుకు లక్ష మేర వ్యాపారం లక్ష్యంగా పెట్టుకోగా రూ.50 వేల వరకు వ్యాపారం జరుగుతోంది. నాణ్యమైన ఉత్పత్తులను విక్రయించడం వల్ల ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోంది. వ్యాపారంలో వచ్చిన లాభాలను ఏడాది తరువాత లెక్కించి సభ్యులకు ఖాతాలకు జమ చేస్తాం.

– కలుముల బాపనమ్మ, ఉపాధ్యక్షురాలు, మహిళా మార్ట్

మరో మార్ట్ ఏర్పాటుకు కసరత్తు



ఏజెన్సీలో మరో మార్ట్ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం. గిరిజన మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో భాగంగా వ్యాపార రంగంలో రాణించాలన్న సంకల్పంతో వారితో మార్ట్ ఏర్పాటు చేయించాం. మరో మండల కేంద్రంలో అక్కడి మహిళా సమాఖ్య సభ్యులతో మార్ట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం.

– శ్రీనివాసరావు, వెలుగు ఏపీడీ, రంపచోడవరం

సవాళ్లను అధిగమిస్తే సత్ఫలితాలు



ట్రైనీ ఐఏఎస్ అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్

ట్రైనీ ఐఏఎస్‌లతో కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతాల్లో విధుల నిర్వహణలో అనేక సవాళ్లు ఉంటాయని, వాటిని అధిగమించి గిరిజనాభివృద్ధే ధ్యేయంగా సేవలందిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. పాడేరు డివిజన్‌లో పర్యటిస్తున్న 2023 బ్యాచ్‌ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందంతో సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో పర్యటన ఎందుకు ఎంచుకున్నారని కలెక్టర్ వారిని ప్రశ్నించారు. గిరిజనాభివృద్ధి కార్యక్రమాలు, జీవన విధానాలు,అధికారుల విధి నిర్వహణ, పరిపాలనపై అవగాహన పొందేందుకు పర్యటిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి సందర్శన వల్ల పాలనపై అవగాహన పెరుగుతుందన్నారు. విధి నిర్వహణ సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఐటీడీఏకు కలెక్టర్ చైర్మన్‌గా పనిచేస్తారని, ఐటీడీఏ పరిధిలోనే అన్ని ప్రభుత్వ శాఖలు పనిచేస్తాయని ఆయన వివరించారు.సింగిల్ లైన్ పాలన విధానంలో ఐటీడీఏ పీవో గిరిజన ప్రాంతాల్లో సంక్షేమ పథకాల అమలును నిరంతరం పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. అటవీ హక్కుల అమలు, కాఫీ ప్రాజెక్ట్, మిషన్ కనెక్ట్, విద్య, వైద్యం, రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పన, ఆపరేషన్ పరివర్తన, ఉపాధి హామీ తదితర అంశాలపై ఆయన సమగ్రంగా వివరించారు. ట్రైనీ ఐఏఎస్ అధికారులు 14 మంది రెండు బృందాలుగా ఏర్పడి చింతపల్లి మండలం తాజంగిలో, మరో ఏడుగురు జీకే వీధి మండలం దుప్పులవాడలో ఉంటూ వారం రోజులు గిరిజనుల జీవన విధానాలు, పరిపాలన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై అధ్యయనం చేస్తారని పీవో పేర్కొన్నారు. డీఎఫ్‌వో వినోద్‌కుమార్, ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ రాజు,డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఐటీడీఏ ఏవో హేమలత, ఏపీడీ జె.గిరిబాబు పాల్గొన్నారు.

భూ రీసర్వేలో అలసత్వం తగదు

కలెక్టర్ సుమిత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా భూముల రీసర్వేలో ఆలసత్వం ప్రదర్శిస్తే సంబంధిత సర్వే బృందాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. జగనన్న భూ హక్కు, భూ రక్ష భూముల రీసర్వే పురోగతిపై సోమవారం కలెక్టరేట్ నుంచి జిల్లాని సబ్‌కలెక్టర్లు, రెవెన్యూ,సర్వే అధికారులతో వీడియో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వే కోసం రైతులు రెవెన్యూ కార్యాలయాలకు రాకూడదన్నారు. 237 గ్రామాల్లో సర్వే రికార్డుల తయారి పూర్తిచేశారని, 954 గ్రామాల్లో ఇప్పటి వరకు భూముల రీసర్వే జరిగిందన్నారు.జిల్లాలో ఇంకా 1200 గ్రామాల్లో భూముల రీసర్వే చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం భూముల సర్వేకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.రెవెన్యూ అధికారులు సర్వే పట్ల నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిరోజు భూముల రీసర్వేకు కొంత సమయం కేటాయించాలని తహసీల్దార్లకు సూచించారు. వై.రామవరం తహసీల్దార్ ఉదయం 11గంటల వరకు వీడియో సమావేశానికి హాజరుకాకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భూముల రీసర్వేను సకాలంలో పూర్తిచేయని తహసీల్దార్లకు నోటీసులు జారీ చేసి, వివరణ తీసుకోవాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు. ముసాయిదా భూమి రికార్డులు తయారుచేసిన తరువాత 24 గంటల్లో ఫారం–3 జారీచేయాలని కలెక్టర్ సూచించారు.జేసీ శివశ్రీనివాస్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం భన్సల్, పాడేరు ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డీఆర్వో పి.అంబేద్కర్, సర్వే ఏడీ మోహన్‌రావు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌పై ఫిర్యాదు



పెదబయలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సురేష్‌కుమార్ తదితరులు

పెదబయలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై యువగళం పాదయాత్రలో అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు, లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడిపై కేసు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎస్‌ఐ మనోజ్‌కుమార్‌కు సోమవారం పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్, కో కన్వీనర్ కొంతెలి గోపాల్, పెదబయలు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సందడి కొండబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గంపరాయి దిలీప్‌కుమార్ ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ముగ్గురిని తక్షణం అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

గురుకులం జాయింట్ సెక్రటరీ రమణమూర్తి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న రమణమూర్తి

అరకులోయ రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యమని గురుకులాల సెక్రటరీ రమణమూర్తి తెలిపారు. మండలంలో క్రీడా పాఠశాల మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా ప్రముఖ హాకీ క్రీడా కారుడు ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకుని సోమవారం ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు, ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులంతా చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ పోటీల్లో జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన 35 జట్లు పాల్గొంటున్నట్టు ఆయన పేర్కొన్నారు. క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తి, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ సన్యాసినాయుడు, కోచ్ అప్పలరాజు, మాధవ, రాజబాబు, పీడీలు బాలన్న,సదు,బాలి పాల్గొన్నారు.

550 కిలోల గంజాయి స్వాధీనం

ఐదుగురి అరెస్టు



గంజాయి నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ రాహుల్ మీనా

మోతుగూడెం: స్థానిక పోలీసులు 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేసినట్టు చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. సోమవారం ఉదయం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ధారకొండ ప్రాంతం నుంచి తెలంగాణ, మహారాష్ట్రకు వ్యాన్‌లో తరలిస్తున్న 550 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. ఈ సమయంలో వ్యాన్‌లో ఉన్న ఐదుగురు పట్టుబడగా, మరో నలుగురు నిందితులు పరారైనట్లు ఏఎస్పీ తెలిపారు. వ్యాన్‌తోపాటు రూ.28 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో చింతూరు సీఐ అప్పలనాయుడు, మోతుగూడెం ఎస్‌ఐ గోపాలరావు పాల్గొన్నారు.

13,578 మందికి జగనన్న విద్యాదీవెన

- రూ.6.70 కోట్ల మేర లబ్ధి
- విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమచేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచన



విద్యాదీవెన చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్,పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు, తల్లులు

సాక్షి,పాడేరు: జగనన్న విద్యాదీవెనతో జిల్లాలో 13,578 విద్యార్థిని, విద్యార్థులకు లబ్ధి చేకూరిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా నగరి నుంచి జగనన్న విద్యాదీవెన నగదు జమ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్‌లో సీఎం ప్రసంగం వీక్షించే కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. కలెక్టర్‌తో పాటు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 13,578 మంది విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతల్లో రూ.6.70 కోట్లను ముఖ్యమంత్రి జమచేశారన్నారు. జిల్లాలో గిరిజన విద్యార్థులు 11,477 మందికి రూ.5కోట్ల 37లక్షల 50వేల 761లు, ఎస్సీ విద్యార్థులు 319 మందికి రూ.21లక్షల 57 వేలు, బీసీ, ఈబీసీ, కాపు విద్యార్థులు 1729 మందికి రూ.కోటి 6లక్షల 64వేలు, క్రిస్టియన్, ముస్లిం, మైనారిటీకి చెందిన 53 మందికి రూ.4లక్షల 31వేల 267లు జమ అయినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం విద్యార్థుల తల్లులకు విద్యాదీవెన చెక్కును వారితోపాటు ఎస్టీ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరాజు చేతులమీదుగా అందజేశారు. గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్. రజని, చింతలవీధి ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరి యువత వ్యాపారవేత్తలుగా ఎదగాలి

చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్

చింతపల్లి రూరల్: గిరి యువత ఉద్యోగంతో పాటు వ్యాపార రంగాల్లో కూడా రాణించాలని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో సేతు కార్యక్రమంలో భాగంగా బ్యాంక్ మేనేజర్లు, ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎమ్‌ఈజీపీ) లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన యువత ఆర్థిక బలోపేతానికి బ్యాంక్ అధికారులు సహకారం అందించాలని ఆయన కోరారు. చదువుకున్న యువతీ యువకులు ఉద్యోగాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధి దిశగా కూడా కృషి చేయాలని సూచించారు. రుణాలిచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలని, ఇందుకుగాను పోలీ సుశాఖ భరోసా ఇస్తుందని ఆయన కోరారు. యూనియన్ బ్యాంక్, యూకో బ్యాంక్,ఏపీజీవీపీ మేనేజర్లు నారాయణరావు, మహేష్, కుమార్, జీకేవీధి సీఐ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జడ్డంగి ఏఎస్‌ఐ మృతి



రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పోలీసుస్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న బీవీఎస్ ప్రకాష్ గుండెపోటుతో మృతి చెందారు. ఆయన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని నివాసంలో ఉండగా ఆదివారం రాత్రి గుండెపోటుకు గురయ్యారు. వెంటనే ఆయనను కుటుంబ సభ్యులు దగ్గరలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. నివాసంలో ఉంచిన ఆయన భౌతిక కాయాన్ని సీఐ షేక్ బాజీలాల్, ఎస్‌ఐ రఘునాథరావు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయం కింద కుటుంబ సభ్యులకు రూ.25 వేలు అందజేశారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.



ఏఎస్‌ఐ ప్రకాష్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఐ, ఎస్‌ఐలు (ఇన్‌సెట్) ఫైల్ ఫొటో

హరివిల్లు కనువిందు



రంగుల హరివిల్లు సోమవారం సాయంత్రం పాడేరులో కనువిందు చేసింది. లగిశపల్లి రోడ్డు నుంచి తుంపాడ కొండలను తాకుతున్నట్టు ఆకట్టుకుంది. స్థానికులు ఈ దృశ్యాన్ని సెల్‌ఫోన్లలో బంధించారు.

– సాక్షి, పాడేరు

డెమో హౌస్ నిర్మాణ పనుల అడ్డగింత

ఎటపాక: పోలవరం నిర్వాసితుల కోసం నిర్మించ తలపెట్టిన కాలనీ డెమో హౌస్ నిర్మాణ పనులను సోమవారం రామగోపాలపురం, బాసవాగు, లక్ష్మీపురం, లింగాలపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. గతంలో ఇదే పరిస్థితి ఎదురవడంతో రెవెన్యూ అధికారులు పృథ్వీ, శ్రీధర్ తదితరులు ముందు జాగ్రత్తగా పోలీసు బందోబస్తు మధ్య పనులు చేపట్టారు. ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి, టీడీపీ నాయకులు అక్కడకు చేరుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ప్రభుత్వ కార్యక్రమాలు అడ్డకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు, రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వానికి చెందిన భూముల్లో అడ్డుకోవడం సరికాదని ఆందోళనకారులకు వారు సూచించారు. చట్టప్రకారం పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని డెమో హౌస్ పనులు అడ్డకోవద్దని అక్కడకు వచ్చిన పోలవరం ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు సూచించారు. అనంతరం పనులు ప్రారంభించారు.



రామగోపాలపురం వద్ద నిర్మిస్తున్న డెమో హౌస్

పెన్షనర్ల సొమ్ము దారి మళ్లింపుపై విచారణ



విచారణ చేస్తున్న ఇన్‌చార్జి డీటీవో శ్రీనివాసరావు

• 2018లో జూనియర్ అకౌంటెంట్ చేతివాటం

మహారాణిపేట(విశాఖ): సీతమ్మధార సబ్ ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్ల సొమ్ము దారిమళ్లింపుపై సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో విచారణ జరిగింది. ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఇన్‌చార్జి డీటీవో కే శ్రీనివాస రావు విచారణ నిర్వహించారు. 2018లో సీతమ్మధార సబ్ ట్రెజరీలో రూ.1.93 కోట్ల పెన్షన్ సొమ్ము దారి మళ్లింది. ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అకౌంటెంట్ ఒకరు ఈ భారీ మొత్తాన్ని తన బంధువులకు చెందిన పెన్షన్ ఖాతాలకు మళ్లించాడు. అప్పట్లో ఈ వ్యవహారం సంచలనం రేకెత్తించింది. విచారణ నిర్వహించిన అనంతరం బాధితుల నుంచి రూ.1.40 కోట్లు రికవరీ చేశారు. మిగిలిన రూ.53 లక్షలు రికవరీ కావాల్సి ఉంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. కేసు విచారణలో ఉండగా జూనియర్ అకౌంటెంట్ మృతి చెందాడు. దీంతో ఈ మొత్తాన్ని ఎలా రికవరీ చేయాలో అన్నదానిపై ట్రెజరీ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అప్పటి ఎస్టీవో, ఏటీవో పాస్‌వర్డ్ ఎలా తెలిసిందన్న దానిపై కూడా ఆరా తీస్తున్నారు. జూనియర్ అకౌంటెంట్ పంపిన బిల్లును సబ్ ట్రెజరీ అధికారి (ఎస్టీవో), అసిస్టెంటు ట్రెజరీ అధికారి (ఏటీవో) ఆమోదించాల్సి ఉంది. ఈ ఇద్దరు ఆమోదించిన తర్వాత డీటీవోకు వెళుతుంది. అక్కడ ఆమోదించిన తర్వాత బిల్లు రూపంలో పెన్షనర్ల ఖాతాలో జమ అవుతుంది. ఎవరి ప్రమేయం లేకుండా జూనియర్ అకౌంటెంట్ ఒక్కడే ఈ వ్యవహారం నడిపి ఉండడని ఉద్యోగులు చెబుతున్నారు. సోమవారం డీటీవో కార్యాలయంలో జరిగిన విచారణకు ఆరుగురు హాజరయ్యారు. వీరిలో ముగ్గురు రిటైర్ ఉద్యోగులు కాగా, ముగ్గురు సర్వీసులో ఉన్నారు. వీరిని నుంచి స్టేట్‌మెంటు రికార్డ్ చేశారు. విచారణకు విజయనగరం ఏటీవో పి.ఎస్.కుమార్, బాధితుల తరఫున ఎంవీఎం శర్మ హాజరయ్యారు. శాఖాపరమైన విచారణ అనంతరం నివేదికను ట్రెజరీ శాఖ డైరెక్టర్‌కు సమర్పిస్తామని ఇన్‌చార్జి డీటీవో శ్రీనివాసరావు తెలిపారు.

భాష.. భావాలకు వారధి

• తెలుగు భాషాభ్యున్నతికి పాటుపడిన గిడుగు
• ఏయూ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ
• నేడు తెలుగు భాష దినోత్సవం



ఏయూ తెలుగు విభాగం



ఏయూక్యాంపస్: భాష భావాలకు వారధి. భావాలను పలకించడం అమ్మ నుంచి అలవడుతుంది. అమ్మ నుంచి అబ్బిన భాష మనకు ఆధారంగా మారుతుంది. అమ్మ తొలి పలుకు బిడ్డలో ఆలోచనాశక్తికి ఆలంబనగా నిలుస్తూ పరిసరాలపై అవగాహన పెంచుతుంది. సమాజంపై అవగాహన పెంచడానికి, అనుబంధం పెనవేయడానికి అమ్మభాష ఉపకరిస్తుంది. ప్రపంచ భాషల్లో ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్న మన మాతృభాష తెలుగు. నేడు తెలుగు భాషా దినోత్సవం.

తెలుగు వారి ఆస్తి గిడుగు

వాడుక భాష వ్యావహారిక భాష కావాలని పరితపించి, పోరాడి సాధించిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులు, అందరికీ తెలుగు భాషను చేరువ చేయాలనే లక్ష్యంతో వ్యవహారిక తెలుగును వాడుకలోకి తెచ్చిన తొలి వ్యక్తి రామ్మూర్తి పంతులు. ఆయన జయంతి (ఆగస్టు 29)ని తెలుగు భాష దినోత్సవంగా జరుపుకొంటున్నాం. ఆయన 1893 ఆగస్టు 29న పర్వతాలపేటలో జన్మించారు. గురజాడ వేంకట అప్పారావుకు సమకాలీకుడు గిడుగు. బీఏ పట్టా పుచ్చుకునే వరకు ఇద్దరూ కలిసి చదువుకున్నారు. సవరభాషపై ఉన్న ఆసక్తితో ఆ భాషను సైతం గిడుగు రామ్మూర్తి పంతులు నేర్చుకున్నారు.

తొలి విభాగం

భాషా ప్రాతిపదికన ఏర్పడిన ఆంధ్రవిశ్వవిద్యాలయం తొలుత కేవలం నాలుగు కోర్సులతో మాత్రమే ఆరంభమైంది. 1926లో ప్రారంభమైన ఏయూలో తెలుగు, చరిత్ర, అర్థ శాస్త్రం, రాజనీతిశాస్త్రం కోర్సులను ప్రారంభించారు. తెలుగు భాషకు ప్రాధాన్యత కల్పిస్తూ తొలి ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి ఆంధ్రవిశ్వవిద్యాలయానికి కాస్త భిన్నంగా ఆంధ్ర విశ్వకళా పరిషత్ అని పేరు పెట్టారు. పేరుకు తగ్గట్టుగా తరువాత కాలంలో సంగీతం, నృత్యం, నాటకం వంటి కళలను సైతం దీనిలో భాగం చేశారు. నేటి పాలకులు మరింత ముందుచూపుతో ఆలోచన చేస్తూ డిజిటల్ రికార్డింగ్ స్టూడియో ఏర్పాటు చేసి, ఆడియో ఇంజినీరింగ్, ఫిల్మ్ ఎడిటింగ్ వంటి కోర్సులను అందిస్తున్నారు. నాటి నుంచి నేటి వరకు తెలుగు విభాగం విరాజిల్లుతోంది. ప్రస్తుత ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి ఇటీవల ఎయిడెడ్ కళాశాలల నుంచి అధ్యాపకులను తీసుకువచ్చి తెలుగు విభాగానికి పూర్వ వైభవాన్ని, జవసత్వాలను అందించారు.

ఏయూకు పుస్తకాలు బహూకరించారు

గిడుగు రామ్మూర్తి పంతులు తాను సేకరించిన, చదివిన అనేక పుస్తకాలను ఏయూలోని డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయానికి బహూకరించారు. నేటికీ ఈ పుస్తకాలు ఇక్కడ భద్రంగా ఉన్నాయి. పద్మకాదంబరి, కుమారకంఠము, బాలదేవీభాగవతము, పార్వతీ పరిణయం, గిరిక పెండ్లి, భజనానంద తరంగిణి, మేఘవాణీ, పెద్దాపుర సంస్థాన చరిత్రము, నాట్యోత్పలము, మాతృదేశ సంకీర్తనము, మణిమేఖల వంటి పుస్తకాలు ఏయూ గ్రంథాలయంలో భద్రపరిచారు. స్వాతంత్ర్యానికి పూర్వం ముద్రించిన అనేక పుస్తకాలు ఇక్కడ లభ్యమవుతున్నాయి.

వారోత్సవాల నిర్వహణ



తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ తెలుగు శాఖలో వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పద్యపఠనం, క్విజ్ చర్చాగోష్ఠి, ఉపన్యాసాలు వంటివి ఏర్పాటు చేశాం. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు.

–ఆచార్య జర్రా అప్పారావు, విభాగాధిపతి

ఏయూలో డిజిటల్ కాగ్నిటివ్ థెరఫి సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి తదితరులు

ఏయూక్యాంపస్: ఏయూలో డిజిటల్ కాగ్నెటివ్ థెరఫి సెంటర్ ఏర్పాటైంది. కెనడాకు చెందిన ఆరెంజ్ న్యూరో సైన్సెస్ సంస్థ ఏయూతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా అధునాతన డిజిటల్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్‌ని ఏయూకు అదించింది. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని నార్త్ క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఆరెంజ్ న్యూరో సైన్సెస్ సంస్థ సీఈఓ డాక్టర్ వినయ్ సింఘ్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు తదితరులు పాల్గొన్నారు. దీని సహాయంతో విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేసి.. అవసరమైన వారికి వెంటనే చికిత్స అందించవచ్చని వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. భవిష్యత్తులో సౌత్ క్యాంపస్‌లో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

ఫుల్ ఫన్ 'మిస్ శెట్టి-మిస్టర్ పోలిశెట్టి'

• హీరో నవీన్ పోలిశెట్టి
• విశాఖలో చిత్ర యూనిట్ సందడి



మీడియా సమావేశంలో హీరో నవీన్ పోలిశెట్టి దర్శకుడు మహేష్‌బాబు

దాబాగార్డెన్స్(విశాఖ): కుటుంబ సమేతంగా హాయిగా చూసే సినిమా మిస్ శెట్టి–మిస్టర్ పోలిశెట్టి అని చిత్ర యూనిట్ పేర్కొంది. సోమవారం హీరో నవీన్ పోలిశెట్టి , దర్శకుడు పి.మహేష్ బాబు తదితరులు విశాఖలో సందడి చేశారు. ఈ సందర్భంగా నగరంలోని ఓ హోటల్‌లో మీడియా సమావేశంలో పాల్గొన్నారు. నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూ అగ్రనటి అనుష్కతో స్క్రీన్ పంచుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 7న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుందన్నారు. జాతి రత్నాలు సినిమా తర్వాత మళ్లీ విశాఖ వచ్చానని గుర్తు చేసుకున్నారు. ఇప్పటికే సినిమా ట్రైలర్‌కి మంచి స్పందన వచ్చిందని, చిత్రంపై మంచి బజ్ ఏర్పడిందన్నారు. ఇందులో తాను స్టాండ్ అప్ కామెడీ పాత్ర చేశానని, నెల్లూరు, విజయవాడ, గుంటూరు జిల్లాలో మూవీ ప్రమోషన్ వర్క్ పూర్తి చేసినట్టు తెలిపారు.

విశాఖలో సీఎంఆర్ షాపింగ్ మాల్, ఆర్‌కే బీచ్ ప్రాంతాల్లో ప్రమోషన్ చేశామని, మంచి స్పందన వచ్చిందన్నారు. ఒక్కడ నుంచి కాకినాడ, వరంగల్, రాజమండ్రి ప్రాంతాల్లో చిత్ర ప్రమోషన్ వర్క్ ఉందని తెలిపారు. తనకు హీరో ప్రభాస్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఉందని, హీరోయిన్ అనుష్కతో కలిసి సినిమా చేస్తానని చిన్నప్పుడు కల వచ్చిందని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

విశాఖకు చెందిన చిత్ర దర్శకుడు, రచయిత పి.మహేష్‌బాబు మాట్లాడుతూ విశాఖ వాసిగా, విశాఖలో సినిమా ప్రమోషన్ కోసం రావడం సంతోషంగా ఉందన్నారు. హీరో నవీన్ ఎనర్జీ చూపించే సినిమా అని, మంచి కంటెంట్ ఉన్న సినిమాలకు విశాఖలో మంచి ఆదరణ ఉంటుందని చెప్పారు. పెళ్లి కాకుండా గర్భిణికావాలని అనుకునే అమ్మాయి, ఆమెకు సహకరించిన అబ్బాయి కథే ఈ సినిమా అని తెలిపారు. కథ డిమాండ్ ప్రకారం ఈ సినిమా హైదరాబాద్, లండన్ నగరాల్లో షూట్ చేశామన్నారు. నిర్మాతలు వంశీ, ప్రమోద్‌లు మంచి ఉత్తమాభిరుచి గల సినిమా చేశారని కొనియాడారు.

కేజీబీవీ విద్యార్థినులకు అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థిని

చింతూరు: స్థానిక కస్తూరిబా గాంధీ విద్యాలయానికి చెందిన ఐదుగురు బాలికలు అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వారిలో ఇద్దరు భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మరో ముగ్గురు స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పదో తరగతి చదువుతున్న వేముల అనూషకు ఆదివారం రాత్రి భోజనం అనంతరం కళ్లు తిరగడంతో పాటు ఆయాసంగా ఉండడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సోమవారం మధ్యాహ్నం పదో తరగతి విద్యార్థినులు కారం సంధ్యశ్రీ, హారితలు అవే లక్షణాలతో బాధపడగా ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. సాయంత్రం ఏడో తరగతి విద్యార్థిని మిడియం ఇందుతో పాటు రాత్రి పదో తరగతి విద్యార్థిని లాడె శ్రుతి కూడా అస్వస్థతకు గురవడంతో స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించారు. ప్రస్తుతం వీరంతా కోలుకుంటున్నట్టు వైద్యులు తెలిపారు. ఐటీడీఏ ఏపీవో కంచర్ల సుజాత ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈవిషయాన్ని ఐటీడీవో పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆమె పాఠశాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినులంతా కోలుకుంటున్నారని ఏపీవో తెలిపారు.

గంజాయి నిందితుడు అరెస్టు



నిందితుడితో ఎస్ఐ సంతోష్, సిబ్బంది

అరకులోయ రూరల్: గంజాయి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు. పెదబయలు మండలం సరియపల్లి గ్రామానికి చెందిన కిల్లో రమేష్ గతేడాది ఆరు కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడిన సంఘటనలో ఏ5 నిందితుడిగా ఉన్నాడన్నారు. ఎట్టకేలకు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

ముగిసిన ఏకలవ్య పాఠశాలల రాష్ట్రస్థాయి సాంస్కృతిక సంబరాలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అరకు, పాడేరు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ,భాగ్యలక్ష్మి, జెడ్పీ చెర్‌పర్సన్ సుభద్ర

అరకులోయ రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. యండపల్లివలస ఏకలవ్య పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఏకలవ్యపాఠశాలల రాష్ట్రస్థాయి సాంస్కృతిక సంబరాలు సోమవారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో అరకు,పాడేరు ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ,కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,జెడ్పీచైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ బంగారు భవిష్యత్తుకోసం యువత కృషి చేయాలని తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అన్నిరంగాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. విద్యార్థులకు అన్ని రంగాలపై అవగాహన ఉండలన్నారు.జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ విద్యా,వైద్య రంగాలకు రాష్ట్రప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో యువత మరింతగా రాణించాలన్నారు. సాంస్కృతి సంబరాల్లో డ్యాన్స్,సంగీతం,థింసా,పెయింటింగ్, వివిధ ప్రదర్శనల పోటీలు నిర్వహించారు. గ్రూప్ సాంగ్ పోటీల్లో మారేడుమిల్లి బాలికలకు మొదటి స్థానం,చింతపల్లి విద్యార్థులకు రెండో స్థానం లభించింది. గ్రూప్ డ్యాన్స్‌లో అరకులోయ ఏకలవ్య పాఠశాలకు మొదటి స్థానం, జీకే వీధి పాఠశాలకు రెండో స్థానం,సోలో సాంగ్ పోటీల్లో అనంతగిరికి మొదటి స్థానం, మారేడిమిల్లి రెండో స్థానం లభించాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకులాల జాయింట్ సెక్రెటరీ రమణమూర్తి,జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాసి,కోఆప్షన్ సభ్యుడు రహీంతుల్లా, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు మూర్తి,భాస్కర్,ప్రభాకర్, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

డుంబ్రిగుడ: మండలంలోని అంత్రిగుడ గ్రామ సమీపంలో అరకు–పాడేరు జాతీయ రహదారి మలుపు వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌కు ఢీ కొట్టడంతో ముందుభాగం నుజ్జునుజ్జయింది. విశాఖపట్నానికి చెందిన పర్యాటకులు డుంబ్రిగుడ పర్యాటక ప్రాంతం చాపరాయి జలపాతం తిలకించేందుకు సోమవారం వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కార్లో ప్రయాణిస్తున్న ఆరుగురికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇప్పటి వరకు ఇదే ప్రదేశంలో పది మంది ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదానికి గురయ్యారు. వీరిలో ఒకరు మృతి చెందగా, మరో తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి.

కానరాని హెచ్చరిక బోర్డులు...

ప్రమాదాలకు నిలయమైన అంత్రిగుడ జాతీయ రహదారిలో హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. పర్యాటక ప్రాంతం కావడంతో కొత్తగా వచ్చేవారు ప్రమాదానికి గురికాకుండా కనీసం హెచ్చరిక బోర్డులుఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయం



కేంద్ర సహాయ మంత్రి భగవంత్ ఖుబా, ఎంపీ జీవీఎల్‌తో అభ్యర్థులు

కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా

తాటిచెట్లపాలెం(విశాఖ): దేశంలోని యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనే ప్రధాని మోదీ ఆశయమని, దీనిలో భాగంగా దేశవ్యాప్తంగా సోమవారం 8వ రోజ్‌గార్ మేళా నిర్వహించి, అర్హులైన అభ్యర్థులకు నేరుగా నియామకపత్రాలు అందజేశామని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా తెలిపారు. సోమవారం సాలగ్రామపురంలోని పోర్టు సాగరమాల కన్వెన్షన్‌లో జరిగిన రోజ్‌గార్ మేళాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ యువతకు 10 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రధాని మోదీ రోజ్‌గార్ మేళా ప్రారంభించి, ఇప్పటి వరకు సుమారు 5 లక్షల మందికి పైగా వివిధ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగాలు కల్పించారన్నారు. సోమవారం వర్చువల్‌గా మరో 51 వేల మందికి నియామకపత్రాలు దేశ వ్యాప్తంగా 45 ప్రాంతాల్లో అందజేశామని తెలిపారు. విశాఖలో జరిగిన ఈ మేళాలో కేంద్ర ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని పీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ, సీఏపీఎఫ్, అస్సాం రైఫిల్స్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎన్‌సీబీ, ఢిల్లీ పోలీస్ వంటి విభాగాల్లో కానిస్టేబుల్స్(జనరల్ డ్యూటీ), సబ్ ఇన్‌స్పెక్టర్ (జనరల్ డ్యూటీ), నాన్ జనరల్ డ్యూటీ కేడర్‌లలో ఉద్యోగాలు పొందిన సుమారు 650 మందిలో 25 మందికి మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ మాట్లాడుతూ 2024 మే నెలాఖరు నాటికి 10 లక్షల ఉద్యోగాలు మోదీ ప్రభుత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ సెక్రటరీ టి.వేణుగోపాల్, సీఐఎస్ఎఫ్ దక్షిణ జోన్ డీఐజీ మాలేటి నందన్, ఆయా విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

30న షాలిమార్-సికింద్రాబాద్ రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ): ఖుర్దారోడ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నిమిత్తం, లింక్ రైలు అందుబాటులో లేనందున ఈ నెల 30వ తేదీన షాలిమార్–సికింద్రాబాద్(22849) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దయినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

అప్పన్న దేవస్థానానికి ఎలక్ట్రిక్ బస్సులు

• కొనుగోలుకు దేవదాయ శాఖ అనుమతి



అశోక్‌గజపతిరాజుకు ఆమోదం పత్రాన్ని అందజేస్తున్న దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో రెండు ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు కొనుగోలు చేసేందుకు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ నుంచి ఆమోదం లభించింది. సంబంధిత ఆర్డర్ కాపీని దేవస్థానానికి కమిషనర్ ఎస్. సత్యనారాయణ పంపించారు. ఒక్కో బస్సు ఖరీదు రూ.కోటి 65లక్షలు. చార్జర్ పాయింట్ రూ.18 లక్షలతో కొనుగోలుకు కమిషనర్ అనుమతి ఇచ్చారు.

ఈమేరకు సంబంధిత పత్రాలను సోమవారం సింహగిరికి వచ్చిన దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుకు ఈఈ శ్రీనివాసరాజు అందజేశారు. దేవస్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టాలని సుమారు ఏడాది క్రితం జరిగిన ట్రస్ట్‌బోర్డు సమావేశంలో అశోక్‌గజపతిరాజు నిర్ణయం తీసుకున్నారు. దేవదాయశాఖ ఆమోదం కోసం దేవస్థానం అధికారులు పంపించారు. దీంతో బస్సులు కొనుగోలు కమిషనర్‌నుంచి అనుమతి వచ్చింది. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో సుజాత, ప్రధానార్చకుడు ఇరగవపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు దర్శనార్థం వచ్చిన అశోక్‌గజపతిరాజు దంపతులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు జీతంతోపాటే నైట్ అలవెన్స్‌లు

అల్లిపురం: ఆర్టీసీ ఉద్యోగులకు త్వరలో ఓటీ, నైట్ అలవెన్స్‌లు ప్రతీ నెలా జీతంతోపాటే చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించిందని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు వలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్, విశాఖ, అనకాపల్లి జిల్లాల ఉమ్మడి విస్తృత స్థాయి సమావేశం సోమవారం అల్లిపురం సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ ట్రీట్‌మెంట్ విషయంలో గతంలో మాదిరిగా కార్పొరేట్ వైద్యం, కార్పొరేషన్ భరించే విధంగా మళ్లీ పునరుద్ధరించే విధంగా కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నందమూరి రామారావు విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కేఎస్ఎస్ మూర్తి, డీఎల్.రాజు, విజయనగరం జోన్ జోనల్ అధ్యక్షుడు కేజే శుభాకర్, జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, రాష్ట్ర మెయింటినెన్స్ కమిటీ సభ్యుడు జి.శ్రీనివాసరావు, విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శి కే శ్రీనివాసరావు, డీఎస్ఎన్ మూర్తి, జోనల్ నాయకులు, ఏడు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజ్ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.